నమస్తే తెలంగాణ
Telangana Today


# నిపుణ

నమస్తే తెలంగాణ
హైదరాబాద్, మంగళవారం 10 డిసెంబర్ 2024
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna



# ప్రత్యేక మెజారిటీ సవరణ @ ప్రకరణ 368

**రాజ్యాంగం ప్రజాస్వామిక దేశాల్లో పరిపాలనకు పునాది, సర్వోన్నతమైనది. ఏ దేశ రాజ్యాంగమైనా దాన్ని రచించే కాలంలో నెలకొని ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల కనుగుణంగా రూపొందిస్తారు. దేశ, కాల పరిస్థితులు మార్పు చెందుతున్నప్పుడు ఉత్పన్నమయ్యే సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను పరిష్కరించేలా రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. ఆ వివరాలు సంక్షిప్తంగా..**




గ్రూప్స్ ప్రత్యేకం
పాలిటీ

**రాజ్యాంగ సవరణ పద్ధతి**

**సవరణ ఆవశ్యకత**

- ఈ వాస్తవాన్ని గ్రహించిన భారత రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ సవరణ విధానాన్ని రాజ్యాంగంలోనే పొందుపరిచారు. రాజ్యాంగ సవరణ విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి గ్రహించారు.

**సవరణ అర్థం**

- సవరణ అంటే కొత్త ప్రకరణలను చేర్చడం, ప్రకరణ తొలగించడం, పూర్తిగా తొలగించడం మార్పులు చేయడం. ఒక ప్రకరణలోని అంశం స్థానంలో మరొక అంశాన్ని చేర్చడం మొదలగు అంశాలన్నిటిని సవరణగానే పరిగణిస్తారు. రాజ్యాంగ సవరణ అనే పదానికి రాజ్యాంగంలో నిర్వచనం లేదు.

**సవరణకు ఉత్తమమైన పద్ధతి ఏది?**

- సాధారణంగా రాజ్యాంగాలను సాధారణ మెజారిటీతో కానీ లేదా ప్రత్యేక మెజారిటీతో కానీ సవరిస్తారు.
- రాజ్యాంగ సవరణకు చాలా సరళమైన ప్రక్రియ ఉన్నప్పుడు రాజ్యాంగ స్థిరత్వం, నిరంతరతకు విఘాతం కలుగుతుంది. అలాగని కఠినమైన ప్రక్రియను ఎంచుకుంటే అవసరమైన మార్పులు చేయడానికి అవకాశం ఉండదు. అందుచేత రాజ్యాంగ నిర్మాతలు ఈ రెండు ప్రక్రియల మధ్య సమతుల్యత పాటించారు.

**సవరణ పద్ధతులు- రాజ్యాంగ స్థానం**

- రాజ్యాంగంలోని 20వ భాగం ప్రకరణ 368లో రాజ్యాంగ సవరణ పద్ధతిని పొందుపరిచారు. రాజ్యాంగ ప్రకరణలను మూడు వర్గాలుగా వర్గీకరించి, మూడు ప్రత్యేక పద్ధతులను నిర్దేశించారు. అవి..

1. పార్లమెంటు సాధారణ మెజారిటీ ద్వారా జరిగే సవరణ పద్ధతి
2. పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ ద్వారా జరిగే సవరణ పద్ధతి
3. పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ, సగానికంటే ఎక్కువ రాష్ట్ర శాసన సభల ఆమోదం ద్వారా జరిగే సవరణ పద్ధతి

**ప్రత్యేక వివరణ**

- మౌలిక రాజ్యాంగంలో ప్రకరణ 368లో రాజ్యాంగాన్ని 'సవరించే ప్రక్రియ' అని పేర్కొన్నారు. కానీ 1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదబంధాన్ని రాజ్యాంగాన్ని, ప్రక్రియను సవరించే అధికారంగా మార్పులు చేశారు.
- ప్రకరణ 368లోని అంశాలను ఇప్పటివరకు రెండు పర్యాయాలు సవరించారు. అవి 24వ రాజ్యాంగ సవరణ (1971), 42వ రాజ్యాంగ సవరణ (1976).

ప్రకరణ 368లో ఐదు సబ్ క్లాజులు ఉన్నాయి. అవి.

1. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని, ప్రక్రియను సవరించే అధికారం
2. ప్రత్యేక మెజారిటీతో సవరించే అంశాలు
3. ప్రకరణ 13లో పేర్కొన్న చట్టం నిర్వచన పరిధిలోని అంశాలు రాజ్యాంగ సవరణ నిర్వచనంలోకి రావు.
4. పార్లమెంటు చేసిన రాజ్యాంగ సవరణను (ప్రాథమిక హక్కులతో సహా) రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానంలో ప్రశ్నించటానికి వీలులేదు.
5. సవరణ అధికారాల్లో మార్పులు, కూర్పులు, రద్దు చేసే అంశాల్లో పార్లమెంటుకు ఏ విధమైన ఆంక్షలు వర్తించవు.

**ప్రత్యేక వివరణ**

- క్లాజు 4, 5లోని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. ఐతే ఈ క్లాజులు చెల్లవని, రాజ్యాంగ విరుద్ధమని మౌలిక నిర్మాణానికి విఘాతం కలిగిస్తాయని 1980లో మినర్వా మిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**సాధారణ మెజారిటీ పద్ధతి**

- ఈ పద్ధతి ప్రకారం సాధారణ మెజారిటీ ద్వారా కొన్ని ప్రకరణలను పార్లమెంటు సవరిస్తుంది. సాధారణ చట్టాన్ని పార్లమెంటు ఏ విధంగా సవరిస్తుందో అదే పద్ధతిలో రాజ్యాంగంలోని కొన్ని ప్రకరణలు సవరించబడతాయి. సాధారణ మెజారిటీ అంటే హాజరై ఓటు వేసిన వారిలో సగానికంటే ఎక్కువ ఉండాలి.

**ప్రత్యేక వివరణ-విశ్లేషణ**

- సాధారణ మెజారిటీ పద్ధతి గురించి ప్రకరణ 368లో ప్రస్తావించలేదు. అందుకే సాధారణ మెజారిటీ ద్వారా జరిగే సవరణలను రాజ్యాంగ సవరణలుగా పరిగణించరు. అంటే అంశాలు ప్రకరణ 368లో పేర్కొన్న రాజ్యాంగ సవరణ పరిధిలోకి రావు.

**ఈ పద్ధతి ద్వారా సవరించే అంశాలు..**

- కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడం, రాష్ట్ర సరిహద్దుల మార్పు, రాష్ట్రాల పేర్ల మార్పు (ప్రకరణలు 1-4)
- రాష్ట్ర ఎగువసభ (విధాన పరిషత్) ఏర్పాటు, రద్దు (ప్రకరణ 169)
- భారత పౌరసత్వంలో మార్పులు (ప్రకరణలు 5-11)
- పార్లమెంటులో కోరం (ప్రకరణ 100)
- రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న రాజ్యాంగ పదవుల జీతభత్యాలు (ప్రకరణలు 59, 65, 75, 97, 125, 148, 158, 164, 186, 221)
- పార్లమెంటులో శాసన నిర్మాణ ప్రక్రియలు, శాసన సభ్యుల అధికారాలు (ప్రకరణలు 105, 194)
- సుప్రీంకోర్టు పరిధికి సంబంధించి అంశాలు (ప్రకరణ 139)
- కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన (ప్రకరణ 239)
- నియోజకవర్గాల పునర్విభజన (ప్రకరణ 82)
- పార్లమెంటులో ఉపయోగించే భాష (ప్రకరణ 120)
- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య నిర్ణయించడం (ప్రకరణ 124)
- అధికార భాషల వాడకం

**పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ ద్వారా సవరించే అంశాలు**

- ప్రకరణ 368 ఈ పద్ధతిని వివరిస్తుంది. రాజ్యాంగంలో అత్యధిక భాగాలు ఈ పద్ధతి ద్వారానే సవరించబడతాయి. పార్లమెంటు ఉభయ సభల్లో హాజరై ఓటు వేసిన వారిలో 2/3వ వంతు మెజారిటీ సభ్యులు ఆమోదించాలి. ఇది మొత్తం సభ్యుల్లో సగానికంటే తగ్గొద్దు. ఈ పద్ధతి ద్వారా కింది అంశాలు సవరిస్తారు. అవి..

ఎ. భారత రాజ్యాంగంలో మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు (ప్రకరణలు 12-35)
బి. భారత రాజ్యాంగంలో నాలుగో భాగంలో పేర్కొన్న నిర్దేశిక నియమాలు (ప్రకరణ 36-51)
సి. మొదటి పద్ధతిలో, మూడో పద్ధతిలో పేర్కొనని ఇతర అన్ని అంశాలు

**ప్రత్యేక మెజారిటీ, రాష్ట్ర శాసన సభల ఆమోదం**

- ఈ పద్ధతిలో పేర్కొన్న అంశాలను పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో ఆమోదించిన తర్వాత ఆ రాజ్యాంగ సవరణ బిల్లును సగానికి తగ్గకుండా రాష్ట్ర శాసనసభలు సాధారణ మెజారిటీతో ఆమోదించాల్సి (ఖాళీలు, గైర్హాజరైన సభ్యులతో కలుపుకొని) ఉంటుంది. రాష్ట్రాల ఆమోదానికి నిర్ణీత సమయం అంటూ ఏదీ ఉండదు.
- రాష్ట్రపతి నిర్ణయించిన గడువులోపల రాష్ట్ర శాసనసభ తన అభిప్రాయాన్ని చెప్పాలి.

**ఈ పద్ధతి ద్వారా సవరించే అంశాలు**

- రాష్ట్రపతి ఎన్నిక విధానం (ప్రకరణ 54, 55)
- కేంద్ర కార్యనిర్వాహక పరిధిని విస్తృతపరచడం (ప్రకరణ 73)
- రాష్ట్ర కార్యనిర్వాహక పరిధిని విస్తృతపరచడం (ప్రకరణ 162)
- కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసనపరమైన అధికారాల విభజన ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలు (ప్రకరణలు 241, 246 భాగం 21)
- రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిథ్యం (ప్రకరణలు 80, 81)
- సుప్రీంకోర్టు (పార్ట్ 5), హైకోర్టు (పార్ట్ 6) సంబంధించి విషయాలు (ప్రకరణలు 124, 214)
- రాజ్యాంగ సవరణ పద్ధతి (ప్రకరణ 368)

**రాజ్యాంగ సవరణ పద్ధతి-నియమ నిబంధనలు**

- రాజ్యాంగాన్ని సవరించే ప్రక్రియలో ప్రకరణ 368లో పేర్కొన్న విధంగా కింది నియమాలను పాటించాలి.
- రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రతిపాదించవచ్చు. రాష్ట్ర శాసనసభలకు రాజ్యాంగ సవరణ ప్రతిపాదించే అధికారం లేదు.
- రాజ్యాంగ సవరణ బిల్లును మంత్రి కాని, సాధారణ సభ్యుడు కానీ ప్రతిపాదించవచ్చు.
- రాష్ట్రపతి పూర్వానుమతి అవసరం లేదు.
- రాజ్యాంగ సవరణ బిల్లు ఉభయ సభలచే నిర్ణీత మెజారిటీ ప్రకారం వేర్వేరుగా ఆమోదించబడాలి. ఒక సభ ఆమోదించి మరో సభ తిరస్కరిస్తే ప్రతిష్టంభన తొలగించడానికి సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. కాబట్టి బిల్లు వీగిపోతుంది.
- సమాఖ్య అంశాలకు సంబంధించి ప్రకరణలు సవరించడానికి సగానికి పైగా రాష్ట్ర శాసనసభలు కూడా తమ ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుంది.
- పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపిన తర్వాత రాజ్యాంగ సవరణ బిల్లును రాష్ట్రపతి ఆమోదముద్రకు పంపుతారు.
- రాష్ట్రపతి తప్పనిసరిగా తన ఆమోదాన్ని తెలపాలి. తిరస్కరించడం కానీ, పునఃపరిశీలనకు కానీ అవకాశం లేదు.

**గమనిక:** రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి తప్పనిసరిగా ఆమోదం తెలపాలనే నియమాన్ని 1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

- రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత రాజ్యాంగ సవరణ బిల్లు చట్టంగా మారుతుంది. చట్టం అమల్లోకి వచ్చిన రోజు నుంచి రాజ్యాంగాన్ని సవరించినట్లుగా పరిగణిస్తారు.
- రాజ్యాంగ సవరణ ప్రక్రియ అనేది స్వయం నిర్దేశిత పద్ధతి. ప్రకరణలో పేర్కొన్న సాధారణ చట్ట సవరణ పద్ధతికి పోలిక లేదు.
- రాజ్యాంగ సవరణ న్యాయసమీక్షకు లోబడి ఉంటుంది.

**గమనిక:** ద్రవ్య బిల్లులోని (ప్రకరణ 110) అంశాలు రాజ్యాంగ సవరణ బిల్లులో ఉన్నప్పటికీ దాన్ని రాజ్యాంగ సవరణ బిల్లుగానే పరిగణిస్తారు. ప్రకరణ 368, ఆర్థిక బిల్లు, ద్రవ్య బిల్లుల్లోని అంశాలను అధిగమిస్తుంది.

## రాజ్యాంగ సవరణ-విమర్శ

- రాజ్యాంగ సవరణలో అనేక లోపాలున్నాయనే విమర్శలున్నాయి.
- రాజ్యాంగ సవరణకు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు/సభ లేకపోవడం
- సవరించే అధికారాన్ని పార్లమెంటుకే పరిమితం చేయడం
- రాష్ట్రాలకు రాజ్యాంగ సవరణలను ప్రతిపాదించే అధికారం లేదు. అమెరికాలోని రాష్ట్రాలకు ఈ అధికారం ఉంది.
- రాజ్యాంగ సవరణలో ఉభయ సభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే పరిష్కారానికి సంయుక్త సమావేశం ఏర్పరిచే ఆస్కారం లేదు.
- రాజ్యాంగంలోని చాలా భాగాలు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ ద్వారా సవరిస్తారు. రాష్ట్రాల భాగస్వామ్యం తక్కువగా ఉంది.
- రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాల ఆమోదంలో జాప్యం జరగవచ్చు. దీనికి కారణం రాష్ట్రాలు నిర్ణీత సమయంలోగా తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించాల్సిన అవసరం లేదు.

**రాజ్యాంగ సవరణ స్వభావం- ప్రముఖుల వ్యాఖ్యానాలు**

- రాజ్యాంగంలో దృఢ, అదృఢ లక్షణాలు మిళితమై ఉన్నాయి. మౌలికంగా దృఢమైన రాజ్యాంగం ఐనప్పటికీ కొన్ని అదృఢ లక్షణాలు కూడా చొప్పించారు. కింది ప్రముఖుల వ్యాఖ్యానాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది.
- భారత రాజ్యాంగ సవరణ పద్ధతి దృఢ, అదృఢ లక్షణాల మధ్య మంచి సమతుల్యాన్ని సాధించింది. సవరణ పద్ధతిలో వైవిధ్యం ఉంది. ఇది చాలా అరుదు, వివేకవంతమైనది.

–కె.సి. వేర్

- సవరణ పద్ధతి సంక్లిష్టంగా బయటికి కనిపించినా అది కేవలం విశిష్టతకు నిదర్శనం.

– గ్రాన్‌విల్ ఆస్టిన్

- భారత రాజ్యాంగం కఠిన, శాశ్వతమైన పద్ధతి ఏర్పాటు చేయాలనుకున్నా, శాశ్వతత్వం అనేది రాజ్యాంగానికి ఉండదు. కొంత సరళత అవసరం. రాజ్యాంగం దృఢమైనదైతే దేశాభివృద్ధికి ఆటంకమవుతుంది.

– జవహర్‌లాల్ నెహ్రూ

- రాజ్యాంగ సవరణ విధానం ఒక మూస విధానాన్ని ఎంచుకోలేదు. ఇదే అంతిమం, సవరణకు అతీతం అనే లేబుల్ ఏర్పాటు చేయదలుచుకోలేదు. ఒక సరళ విధానాన్ని పొందుపరచటం జరిగింది.

–డా.బీఆర్ అంబేద్కర్

**జీబీకే పబ్లికేషన్స్, హైదరాబాద్**

### విద్య, ఉద్యోగ సమాచారం

**ఎంఎస్ఎంఈ ఉచిత కోర్సులు**

**హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) కింది ఉచిత కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

- **కోర్సులు:** ఆటో క్యాడ్, హైపర్‌మెష్, 3డీ ప్రింటింగ్, మాస్టర్ క్యామ్, ఏఐ&డీఎల్, ఐవోటీ, వర్చువల్ రియాలిటీ, ఇండస్ట్రీ 4.0 సొల్యూషన్స్, మైక్రో కంట్రోలర్ ప్రోగ్రామ్, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, సీఎన్‌సీ, డిజిటల్ డిజైన్ అండ్ వెరిఫికేషన్ తదితరాలు
- **అర్హతలు:** డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్
- **వయస్సు:** 18 ఏండ్లు నిండినవారు
- మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.citdindia.org

**అసిస్టెంట్ ప్రొఫెసర్లు...**

**పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 4
- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, స్కూల్ ఆఫ్ రోబోటిక్స్, క్వాంటమ్ టెక్నాలజీ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 21
- **వెబ్‌సైట్:** www.diat.ac.in


**ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్**

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ : కరెంట్ అఫైర్స్, సోషల్ స్టడీస్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# 'సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణ'గా ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఏది?

పోటీ పరీక్షల ప్రత్యేకం
చరిత్ర బిట్స్



1. **ప్రస్తుతం ఉన్న జిల్లాలు వాటి పూర్వ నామాలను జతపరచండి.**
   ఎ. ఆదిలాబాద్ — 1. ఇందూరు
   బి. నిజామాబాద్ — 2. కందన వోలు
   సి. నాగర్ కర్నూల్ — 3. ఏదులాపురం
   డి. సూర్యాపేట — 4. భానుపురి
   1. ఎ-1, బి-2, సి-3, డి-4
   2. ఎ-3, బి-1, సి-2, డి-4
   3. ఎ-3, బి-2, సి-4, డి-1
   4. ఎ-4, బి-3, సి-2, డి-1
2. **కింది వాటిలో సరైన వ్యాఖ్యలను గుర్తించండి.**
   ఎ. ఆదివాసీ నాయకపోడ్‌లు కార్తిక మాసంలో భీమన్న దేవుని (జాతర) ఉత్సవాలను నిర్వహిస్తారు
   బి. మొదటి రోజు దేవుని గధలను ఊరేగిస్తారు
   సి. రెండో రోజు భీమన్న దేవుని ఊరేగింపు అనంతరం స్నానానికి తీసుకొని పోతారు.
   డి. చివరి రోజున భీమన్న కల్యాణం, అగ్ని గుండం దున్నుట, భీమన్న ప్రజాదర్బార్ నిర్వహిస్తారు.
   1. ఎ, బి  2. బి, సి
   3. ఎ, బి, సి  4. ఎ, బి, సి, డి
3. **తెలంగాణలో భీమన్న(జాతర) ఉత్సవాలు ప్రధానంగా కింది ఏ జిల్లాల్లో జరపుతారు.**
   1. అదిలాబాద్  2. ఆసిఫాబాద్
   3. ఖమ్మం  4. నిర్మల్
   5. నిజామాబాద్
   1. ఎ, బి, సి  2. బి, సి, డి
   3. డి, ఎ, బి  4. పైవన్నీ సరైనవే
4. **కింది వాటిలో సరైనవి గుర్తించండి**
   1. 1949 నాటి హైదరాబాద్ రాష్ట్రం గుర్తించిన 9 గిరిజన తెగల్లో నాయకపోడ్ ఒకటి
   2. 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం తెలంగాణలో నాయకపోడ్ జనాభా 1,73,000గా ఉంది
   3. క్రీస్తు శకం 8వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం చివరి వరకు రాజుల వద్ద సైన్యంలో నాయక/ నాయకుడిగా రాజ్య రక్షణలో వివిధ హోదాలో పనిచేశారు.
   4. నాయకపోడ్ తెగల ప్రధాన జీవన ఆధారం పోడు వ్యవసాయం
   1. బి, డి  2. సి, ఎ  3. ఎ, డి  4. ఎ, బి, సి, డి
5. **ప్రతిపాదన(ఎ) : ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ గ్రామంలో గోండులు నాగోబా జాతర సందర్భంగా గోండు దర్బారును నిర్వహించి తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తారు.**
   **ప్రతిపాదన (ఆర్):** నిజామాబాద్ జిల్లా పోచంపాడు గ్రామంలో నాయకపోడ్‌లు ప్రతి సంవత్సరం కార్తికమాసంలో భీమన్న ప్రజా దర్బార్ నిర్వహిస్తారు
   1. (ఎ) నిజం, (ఆర్) తప్పు
   2. (ఎ) తప్పు, (ఆర్) నిజం
   3. (ఎ) (ఆర్) నిజం, (ఆర్) (ఎ)కు సరైన వివరణ
   4. (ఎ), (ఆర్) నిజం, (ఆర్)కు (ఎ) సరైన వివరణ కాదు
6. **శాతవాహనుల కాలంనాటి అధికారి పేరు, వారి వృత్తి ఆధారంగా క్రింది వాటిని జతపరచండి.**
   ఎ. హరణిక — 1. ఆస్థాన వైద్యుడు
   బి. రాజవిక — 2. వ్యవసాయ పర్యవేక్షణ అధికారి
   సి. రజ్జ గాహకుడు — 3. భూమిశిస్తు వసూలు
   డి. సీతాధ్యక్ష — 4. కోశాధికారి
   1. ఎ-1, బి-2, సి-3, డి-4
   2. ఎ-3, బి-1, సి-2, డి-4
   3. ఎ-3, బి-2, సి-4, డి-1
   4. ఎ-4, బి-1, సి-3, డి-2
7. **ముదిగొండ చాళుక్యుల కాలంలో సామాజిక ఆర్థిక పరిస్థితులకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.**
   1. ముదిగొండ చాళుక్యులు తమని తాము హారతి పుత్రులమని, సప్త మాత్రుకలచే పాలించబడేవారమని చెప్పుకొన్నారు.
   2. ముదిగొండ చాళుక్యులది మానవ్యస గోత్రం
   3. వీరి కాలంలో పన్నులను బలవంతంగా వసూలు చేసేవారు
   1. ఎ, బి  2. బి, సి
   3. ఎ, బి, సి  4. పైవేవీ సరికావు
8. **కింది వాక్యాల్లో సరికానిది గుర్తించండి.**
   1. మూసీ నదిపై మొట్టమొదటి వంతెన పురానాపూల్ వంతెన
   2. వంతెనను క్రీస్తు శకం 1587లో నిర్మించారు
   3. పురానాపూల్ వంతెన పారిస్‌లోని పాంట్ న్యూఫ్ వంతెన వలె అందంగా ఉన్నదాన్ని టావెర్నియర్ పేర్కొన్నాడు.
   4. టావెర్నియర్ పురానాపూల్ వంతెన్ను ప్రేమ వంతెనగ వర్ణించాడు
9. **కింది వాటిలో ప్రాంతాలు, ప్రసిద్ధి చెందిన అంశాలను జతపరచండి**
   ఎ. విత్తనాలు (సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణ) — 1. సికింద్రాబాద్
   బి. రూసా గడ్డి ( సుగంధ ద్రవ్యాల్లో వాడేది) — 2. అంకాపూర్
   సి. దంతపు బొమ్మలు — 3. మహబూబ్ నగర్
   డి. తుంగ చాపలు — 4. నిజామాబాద్
   1. ఎ-2, బి-4, సి-1, డి-3  2. ఎ-3, బి-1, సి-2, డి-4
   3. ఎ-3, బి-2, సి-4, డి-1  4. ఎ-4, బి-3, సి-2, డి-1
10. **కింది వాటిలో బౌద్ధమత క్షేత్రాలు అవి ఉన్న ప్రాంతాలను జతపరచండి**
   ఎ. మహూరు — 1. పెద్దపల్లి
   బి. పాణిగాం — 2. (కుమ్రం భీం) ఆసిఫాబాద్
   సి. మీర్జం పేట — 3. మహబూబ్ నగర్
   డి. వర్ధమానుకోట — 4. జగిత్యాల
   1. ఎ-1, బి-2, సి-3, డి-4  2. ఎ-3, బి-1, సి-2, డి-4
   3. ఎ-2, బి-4, సి-1, డి-3  4. ఎ-4, బి-3, సి-2, డి-1
11. **తెలంగాణలోని పూర్వపు కోటలు (ఖిల్లా) అవి ఉన్న ప్రాంతాలను గుర్తించండి.**

| | | |
|---|---|---|
| ఎ. గాంధారి ఖిల్లా | 1. పెద్దపల్లి | 1. ఎ-1, బి-2, సి-3, డి-4 |
| బి. ఎలగందుల కోట | 2. నిజామాబాద్ | 2. ఎ-3, బి-4, సి-2, డి-1 |
| సి. రామాలయం ఖిల్లా | 3. మంచిర్యాల | 3. ఎ-3, బి-2, సి-4, డి-1 |
| డి. రామగిరి ఖిల్లా | 4. కరీంనగర్ | 4. ఎ-4, బి-3, సి-2, డి-1 |

12. **1969 ఉద్యమ సమయంలో ఏ జాతీయ పార్టీలు ప్రత్యేక తెలంగాణకు మద్దతు తెలిపాయి.**
   1. సంయుక్త సోషలిస్ట్ పార్టీ
   2. భారతీయ క్రాంతి దళ్ పార్టీ
   3. స్వాతంత్ర్య పార్టీ
   1. ఎ, బి  2. బి, సి
   3. సి  4. పైవన్నీ సరైనవే
13. **ఆరు సూత్రాల పథకం ద్వారా తెలంగాణకు జరిగిన అన్యాయాలను గుర్తించండి.**
   1. 1958లో ఏర్పడిన తెలంగాణ ప్రాంతీయ కమిటీని రద్దు చేశారు
   2. తెలంగాణ ఆంధ్ర ప్రాంత ఆదాయ గేయాలు బడ్జెట్‌లో వేర్వేరుగా చూపాలన్న నియమం కూడా రద్దయిపోయింది
   3. తెలంగాణ ఆంధ్ర ప్రాంత ఆదాయ గేయాలు బడ్జెట్‌లో వేర్వేరుగా చూపాలన్న నియమం కూడా రద్దయిపోయింది
   4. తెలంగాణలో ముల్కీ నిబంధనలు రద్దు చేయబడినవి
   1. బి, సి  2. సి, ఎ
   3. ఎ, బి  4. పైవన్నీ సరైనవే
14. **ఎమర్జెన్సీ సమయంలో నిలిచిపోయిన జీవనాడి పత్రికను 1983లో తిరిగి ఎవరి చేతుల మీదుగా ప్రాంభించారు.**
   1. ఎన్.టి. రామారావు
   2. దేవులపల్లి వెంకటేశ్వరరావు
   3. చాకలి ఐలమ్మ
   4. తరిమెళ్ల నాగిరెడ్డి
15. **తెలంగాణ విద్యావంతుల వేదిక కార్యక్రమాల్లో సరైన వాటిని గుర్తించండి.**
   1. జీవో నెం. 160, గిర్ గ్లానీ సిఫారసుల అమలు కోసం ఉద్యమించింది
   2. సింగరేణి కార్మికుల సమస్యలు చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు మెదక్ జిల్లాలోని రైతుల కరెంటు కష్టాలపై ప్రత్యేక పోరాటాలు చేసింది.
   3. తెలంగాణకు నష్టం కలిగించే పోతిరెడ్డిపాడు పులిచింతల వంటి అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించింది
   4. పోలవరం ప్రాజెక్టు ఆపాలని కోర్టులో కేసులు వేసింది.
   1. ఎ, బి  2. బి, సి, డి
   3. ఎ, సి  4. ఎ, బి, సి, డి
16. **నిజామాబాద్ జిల్లాకు చెందిన పర్వతారోహకురాలు మలావత్ పూర్ణజీవిత చరిత్ర ఆధారంగా తీసిన ''పూర్ణ'' సినిమాకు దర్శకత్వం వహించినది ఎవరు?**
   1. రాహుల్ బోస్
   2. రాజకుమార్ హిరానీ
   3. సంజయ్‌లీలా బన్సాలీ
   4. అనురాగ్ కశ్యప్
17. **శాతవాహనుల కాలం నాటి నాణేలకు సంబంధించి సరికాని దాన్ని గుర్తించండి.**
   1. వీరి కాలంలో తమిళనాడులోని అరికమేడు రోమన్ సామ్రాజ్యంతో వర్తకానికి ప్రధాన కేంద్రంగా ఉండేది
   2. నల్లగొండలోని గుతిపర్తిలో క్లాడియస్ చక్రవర్తి నాణేలు లభించాయి
   3. శాతవాహనులు ఫోటిన్ మిశ్రమ లోహ నాణేలను ముద్రించలేదు
   4. ఖమ్మంలోని నాగవరప్పాడులో రోమన్ బంగారు నాణేలు విరివిరిగా లభించాయి
18. **కింది వాటిలో మొదటి అరికేసరి బిరుదులను గుర్తించండి.**
   ఎ. సమస్త లోకాశ్రయ
   బి. శాద్వాద చలసింహ
   సి. సకల కళా ప్రావీణ
   డి. రాజా త్రినేత్ర
   1. ఎ, డి  2. ఎ, బి
   3. ఎ, సి  4. పైవన్నీ సరైనవే
19. **కాకతీయుల మంత్రి మండలికి సంబంధించి సరైన వాటిని జతపరచండి.**
   ఎ. ప్రాడ్వి వాక్కుడు — 1. న్యాయాధికారి
   బి. లెంకలు — 2. విదేశాంగ మంత్రి
   సి. సంధి విగ్రహ — 3. రాజు అంగరక్షకులు
   డి. ప్రగడ — 4. అంతఃపుర పర్యవేక్షణ అధికారి
   1. ఎ-1, బి-2, సి-3, డి-4
   2. ఎ-1, బి-3, సి-2, డి-4
   3. ఎ-3, బి-2, సి-4, డి-1
   4. ఎ-4, బి-3, సి-2, డి-1
20. **కుతుబ్‌షాహీల కాలంలో కింది అధికారులను వారి హోదాలతో జతపరచండి.**
   ఎ. పీష్వా — 1. ఆర్థిక శాఖ మంత్రి
   బి. సర్ఖేల్ — 2. సైన్య శాఖ మంత్రి
   సి. మీర్ జుమ్లా — 3. ప్రధానమంత్రి
   డి. ఐ నుల్ ముల్క్ — 4. ముఖ్య రెవెన్యూ అధికారి
   1. ఎ-1, బి-2, సి-3, డి-4
   2. ఎ-3, బి-4, సి-1, డి-2
   3. ఎ-3, బి-2, సి-4, డి-1
   4. ఎ-4, బి-3, సి-2, డి-1
21. **కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి**
   1. సాలార్‌జంగ్ రైత్వారీ విధానాన్ని రద్దు చేశాడు
   2. ధాన్య రూపంలో శిస్తు వసూలు చేసే అధికారులను బిల్ మక్తేదారులు అని అనేవారు
   3. భూమి శిస్తును ధన రూపంలో చెల్లించడాన్ని రైత్వారీ విధానం అంటారు (రైత్వారీ విధానంలో రైతు నేరుగా ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తాడు)
   4. భూమి శిస్తును ధాన్య రూపంలో వసూలు చేయడాన్ని బటాయి విధానం అంటారు
22. **కింది ఏ రచనలు నిజాం కాలం నాటి గ్రామాల్లోని వెట్టి చాకిరీ గురించి తెలియజేస్తాయి.**
   ఎ. వట్టి కోట ఆళ్వారుస్వామి – ప్రజల మనిషి, గంగు
   బి. దాశరథి రంగాచార్య – చిల్లర దేవుళ్లు
   సి. బొల్లిముంత శివరామకృష్ణ– మృత్యునీడలు
   1. ఎ, సి  2. సి, బి
   3. బి, ఎ  4. పైవన్నీ సరైనవే
23. **తెలంగాణ గ్రంథాలయ ఉద్యమ పితామహుడిగా కింది వారిలో ఎవరిని పేర్కొంటారు?**
   1. మానవల్లి రామకృష్ణ కవి
   2. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   3. సురవరం ప్రతాపరెడ్డి
   4. ఆదిరాజు వీరభద్రరావు
24. **కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.**
   ఎ. కుంటాల జలపాతం తెలంగాణ రాష్ట్రంలో ఎత్తయిన జలపాతం
   బి. కడెం నదిపై కుంటాల జలపాతం కలదు
   1. ఎ  2 బి
   3. ఎ, బి  4. పైరెండు కావు
25. **కింది ఏ దేవాలయాన్ని 'వీసాగాడ్' అని పిలుస్తారు?**
   1. సంఘీ వేంకటేశ్వర స్వామి గుడి
   2. యాద్రాది లక్ష్మీనరసింహస్వామి గుడి
   3. చిలుకూరి బాలాజీ గుడి
   4. కీసర రామలింగేశ్వర స్వామి గుడి

**జవాబులు**

| | | | | |
|---|---|---|---|---|
| 1.2 | 2.4 | 3.4 | 4.4 | 5.3 |
| 6.4 | 7.1 | 8.2 | 9.1 | 10.3 |
| 11.2 | 12.4 | 13.4 | 14.3 | 15.4 |
| 16.1 | 17.3 | 18.1 | 19.2 | 20.2 |
| 21.1 | 22.4 | 23.2 | 24.3 | 25.3 |

డా.మంతెన రవికుమార్
విషయనిపుణులు
ఆలూర్,నిజామాబాద్

